

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్ అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 174 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 06 - 01 - 2025 | పేజీలు : 4


# ప్రభుత్వంపై స్వామీజీల ధర్మాగ్రహం.. డిక్లరేషన్



**విజయవాడ, జనవరి 5, జనస్వరం :** హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం ఏమిటంటూ స్వామిజీలు ధర్మాగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మతాల్లో లేని ఈ తరహా పద్ధతి హిందూ దేవాలయాలపైనే ఎందుకు అని ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. గుడి బయట చెప్పులు విడిచిన దగ్గర నుంచి గర్భ గుడిలో దేవుడి దర్శనం వరకు అంతా వ్యాపారమేనంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడి దర్శనం కోసం వెళ్లాలంటే.. జేబు గుల్ల చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ ఓ సామాన్య భక్తుడు సైతం తీవ్ర ఆవేదన చేస్తున్నాడని తెలిపారు. దేవుడికి, భక్తుడికి మధ్య ఈ ప్రభుత్వం ఇలా అనుసంధాన కర్తగా ఎందుకు వ్యవహరించాలని వారు సూటిగా నిలదీస్తున్నారు. దేవాలయాల్లో భక్తులు పడుతోన్న వేదనను ఈ ప్రభుత్వాలు అసలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వేళ ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ధార్మిక స్వాతంత్య్ర పోరాటం కోసం హైందవ శంఖారావానికి విశ్వ హిందూ పరిషత్ పిలుపునిచ్చింది. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా అందుకోసం సభలు నిర్వహిస్తోంది. అందులోభాగంగా జనవరి ఐదవ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా కేసరపల్లిలో హైందవ శంఖారావం నినాదంతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. హిందూ ఆలయాలు ప్రభుత్వాల చేతిలో పెట్టుకుని ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని ఈ శంఖారావ సభలో పాల్గొన్న పలువురు వక్తలు ఆరోపించారు. ఆలయాలను భక్తులే స్వయం ప్రతిపత్తితో నిర్వహించాలనే డిమాండ్ ఈ సందర్భంగా తెర మీదకు వచ్చింది. ఈ సభలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు అలోక్ కుమార్, చిన్న జీయర్ స్వామి, కమలానంద భారతి స్వామితోపాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. హిందూ ధర్మంపై జరుగుతోన్న దాడిని ఈ సందర్భంగా వారు సోదాహరణగా వివరించారు. దేవాలయాల ఆస్తులు, ఆచారాలు నాశనమైపోతున్నాయని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాలు బాగుంటేనే మనం బాగుంటామన్నారు. మన దేవాలయాలకు గతంలో 15 లక్షల ఎకరాలు ఉండేదని.. కానీ ఐస్ గడ్డ మాదిరిగా కరుగుతూ 4.50 లక్షల ఎకరాలు మాత్రమే మిగిలిందని గుర్తు చేశారు. ఆలయాలకు సంబంధించిన నిర్ణయాలు ఎవరు చేయాలని ప్రశ్నించారు. కార్యాలయాల్లో కూర్చొని అధికారులు చేయాలా? అని నిలదీశారు. ఆలయాలను నిర్మించుకొనే మనం.. వాటిని నడపలేమా? అని అడిగారు. 'మా ఆలయాలను మేమే నిర్వహించుకుంటాం... అధికారులు అవసరం లేదు'' ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆలయాలు.. రాజకీయ కమిటీలతో నిండిపోతున్నాయిని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయాల ఆస్తులు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఆలయాల్లో జరిగే దేవుడి ఆరాధనలు.. సంప్రదాయాల్లో అధికారుల ప్రమేయం ఉండకూడదని స్పష్టం చేశారు. దేవుడి వద్ద వీఐపీ దర్శనాలేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తిరుపతిలో దేవుడి దర్శనాల్లో వీఐపీ, సామాన్యుడు పేరిట జరుగుతోన్న తారతమ్యాలపై ఆందోళన వ్యక్తం చేశారు. దేవుడి దర్శనానికి నిబంధనలు పెట్ట బట్టే మతమార్పిడులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఆలయాల్లో నిబంధనలు.. సంప్రదాయాలను పాటించని వారు.. విధుల నుంచి పక్కకు తొలగాలని సూచించారు. ఆక్రమణల్లో ఉన్న ఆలయాల ఆస్తులను స్వాధీనం చేయాలని అక్రమార్కులను డిమాండ్ చేశారు.

అలా జరిగితే ఆలయాలు ధూప దీప నైవేద్యాలకు చేయిచాచాల్సిన అవసరం లేదన్నారు. అలాగే ఆలయాల్లో దేవుడి దర్శనానికి టిక్కెట్లతో అవసరమే లేదని చెప్పారు. మన ఆలయాలు మళ్లీ పవర్ ఫుల్ సెంటర్లుగా మార్చుకోవాలని హిందువులకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి పిలుపునిచ్చారు. అలాగే శ్రీభువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామిజీ మాట్లాడుతూ.. మనం నిర్మించుకున్న ఆలయాలపై ప్రభుత్వాల పెత్తనమేంటని ప్రశ్నించారు. దేవాదాయ శాఖను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సినిమాలకు మాదిరి కౌంటర్లు, టిక్కెట్లు పెట్టి ఆలయాల్లో దైవ దర్శనాన్ని విక్రయిస్తున్నారని మండిపడ్డారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ దుర్మార్గమైనదని అభివర్ణించారు. మన రాష్ట్రంలోని దేవాలయాల బోర్డుల్లో హిందూ అనే పదాన్ని తీసేశారని గుర్తు చేశారు. దీనిని ప్రశ్నించాలని హిందూ సమాజమానికి సూచించారు. ప్రభుత్వమే దేవాలయాల భూములను కబ్జా చేసి ప్రభుత్వ కార్యాలయాలు,గోడౌన్లు నిర్మించిందని విమర్శించారు. దేవాలయంలో ఒక దేవుడుంటే 20 హుండీలు ఎందుకు పెడుతున్నారని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. అలాగే ప్రముఖ గీత రచయిత అనంత్ శ్రీరామ్ సైతం తనదైన శైలిలో స్పందించారు. ఈ హైందవ శంఖారావ సభ వేదికగా డిక్లరేషన్.. హిందూ దేవాలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి కలిపిస్తూ చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేసింది. హిందు ఆలయాల ఆస్తులు, వ్యవస్థలపై దాడులు సరికాదని స్పష్టం చేసింది. అన్యాయంగా, చట్టవిరుద్ధంగా దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వినాయక చవితి, దసరా వేడుకలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక భారం, అక్రమ ఆంక్షలు తగవంది. హిందూ దేవ దేవతల శోభాయాత్రల మార్గాలు, తేదీలు, విధానాలపై అక్రమ ఆంక్షలు తగవని పేర్కొంది. ఆలయాల్లో పూజ, ప్రసాద, కైంకర్య సేవలు అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించాలని డిమాండ్ చేసింది.

హిందూ ఆలయాల్లో అన్య మత ఉద్యోగులను తక్షణం తొలగించాలని డిమాండ్ చేసింది. ట్రస్టు బోర్డులో హిందూ ధర్మంపై భక్తి శ్రద్ధలు ఉండే భక్తులను మాత్రమే సభ్యులుగా నియమించాలని ప్రభుత్వానికి సూచించింది. రాజకీయేతర ధార్మిక వ్యక్తులను మాత్రమే ట్రస్టు బోర్డుల్లో స్థానం కల్పించాలని స్పష్టం చేసింది. హిందూ దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలంది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకుని ఆలయాలకు తిరిగి వాటిని అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆలయాల నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు మళ్లించ రాదని చెప్పింది. హైందవ శంఖారావంలో ఈ మేరకు డిక్లరేషన్‌పై చినజీయర్ స్వామిజీ సభకు హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు.

## కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనల కోసమే మోదీ విశాఖ వస్తున్నారు : మంత్రి నారా లోకేశ్

**విజయవాడ, జనవరి 5, జనస్వరం :** ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇవాళ విశాఖలో సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను లోకేశ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కీలక ప్రాజెక్టుల శంకుస్థాపనల కోసమే ప్రధాని విశాఖకు వస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ తన పర్యటనలో నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు, రూ.70 వేల కోట్ల ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, విశాఖ-చెన్నై ఎకనామిక్ కారిడార్ లో కృష్ణపట్నం వద్ద కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన... రూ.3,900 కోట్లతో పూర్తయిన రహదారుల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేస్తారని లోకేశ్ వివరించారు. ముఖ్యమైనది, మనందరి కల విశాఖ రైల్వేజోన్ హెడ్ క్వార్టర్స్ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. గత ప్రభుత్వం కనీసం భూమి కూడా కేటాయించలేదని, దాంతో రైల్వే జోన్ ఆలస్యమైందని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం భూమిని కేటాయించడంతో, రైల్వే జోన్ భవన నిర్మాణాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని లోకేశ్ వివరించారు. ఇదేకాకుండా, పలు రైల్వే అభివృద్ధి పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఎన్నికల్లో ఎన్డీఏ విజయం తర్వాత తొలిసారిగా విశాఖ వస్తున్న ప్రధానికి ఘనస్వాగతం పలుకుతామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.



గాడితప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కట్టుబడి ఉన్నామని... గత వైసీపీ ప్రభుత్వం ఒక ఫేక్ ప్రభుత్వం అని విమర్శించారు. గత సర్కారు ఉత్తరాంధ్ర యువతకు ఎలాంటి ఉపాధి చూపించలేదని అన్నారు. అభివృద్ధి చేయకుండా ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ ను విశాఖకు తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇక్కడి ఎయిర్ పోర్టుకు భూసేకరణ చేసిన ఘనత కూడా ఎన్డీయే కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. విశాఖలోని రుషికొండ ప్యాలెస్ ను ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. ఒక్క వ్యక్తి కోసం రూ.1000 కోట్లు వృథా చేశారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం ఉన్న కంపెనీలన్నింటినీ తరిమేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక గూగుల్, టీసీఎస్ వంటి కంపెనీలు ఏపీకి వస్తున్నాయని వివరించారు. వాలంటీర్లకు సంబంధించి గత ప్రభుత్వం ఎలాంటి జీవో ఇవ్వలేదని లోకేశ్ స్పష్టం చేశారు. ఎన్నికల వేళ 80 శాతం మంది వాలంటీర్లతో జగన్ రాజీనామా చేయించారని వెల్లడించారు.

## చైనాలో పిల్లులకు ప్రాణాంతక వైరల్ వ్యాధి.. కొవిడ్ టాబ్లెట్లు వేస్తున్న చైనీయులు



ప్రాణాంతక వైరస్‌లు,వ్యాధులకు పుట్టినిల్లు అయిన చైనాలో ప్రస్తుతం పిల్లులు ప్రాణాంతకమైన 'ఫీలైన్ ఇన్ఫెక్షియస్ పెర్టోనిటిస్' అనే వైరల్ వ్యాధి బారినపడుతున్నాయి. ఫీలైన్ కరోనా వైరస్ అని కూడా పిలిచే ఈ వైరల్ ఇన్ఫెక్షన్ పిల్లులకు మాత్రమే సోకుతుంది. ఈ వైరస్ శరీరం అంతటా వ్యాపిస్తుంది. క్రమక్రమంగా తెల్ల రక్త కణాలకు సోకి ప్రాణాంతకంగా మారుతుంది. పిల్లులకు సంక్రమిస్తున్న ఈ వైరస్ పట్ల పెంపకందార్లు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యాధి సోకకుండా, సోకిన తర్వాత చికిత్సలో చాలామంది యజమానులు కొవిడ్ వైద్యంలో వినియోగించే మందులను పిల్లులకు వేస్తున్నారని స్థానిక మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సాధారణంగా 'ఫీలైన్ ఇన్ఫెక్షియస్ పెర్టోనిటిస్' చికిత్సకు వాడే మెడిసిన్స్ ధరలు చాలా ఎక్కువగా ఉంటాయి. అందుకే కొవిడ్ మందుల వినియోగానికి చైనీయులు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొవిడ్ యాంటీ వైరల్ మందులు కూడా 'ఫీలైన్ ఇన్ఫెక్షియస్ పెర్టోనిటిస్' వ్యాధి చికిత్సలో ప్రభావం చూపుతాయని అధ్యయనాలు చెబుతుండడంతో కొవిడ్ మందుల వైపే యజమానులు మొగ్గుచూపుతున్నారు. దీంతో, కొవిడ్ మందుల అమ్మకాలు అక్కడ జోరుగా సాగుతున్నాయి. కొవిడ్ మందులతో పిల్లులు కోలుకుంటున్నాయని చైనీయులు చెబుతున్నారు. మరోపక్క, చైనాలో హెచ్ఎంపీవీ అనే మరో కొత్త వైరస్ కలకలం రేపుతున్న విషయం తెలిసిందే.

## జీవితం - వి "చిత్రం"



@Telugu_toonz (X)

## ఈరోజు పంచాంగం వేళలు

తేదీ : 06 జనవరి 2025
తిథి : బహుళ ఏకాదశి ( తె : 1.40 వరకు )
నక్షత్రం : పునర్వస్సు ( సా 5.55 వరకు )
బ్రహ్మముహూర్తం : తె 4.34 నుండి తె 5.22 వరకు
రాహుకాలం : ఉ 10.48 నుండి మ 12.20 వరకు
యమగండం : మ 3.25 నుండి మ 4.57 వరకు
వర్జ్య కాలం : తె 5.15 నుండి ఉ 7.09 వరకు

## ఈరోజు నమాజ్ వేళలు

తేదీ : 06 జనవరి 2025
ఫజర్ : 4.44 ఉదయం
సూర్యోదయం : 5.57 ఉదయం
జొహర్ : 12.13 మధ్యాహ్నం
అసర్ : 3.33 సాయంత్రం
మగ్రిబ్ : 6.28 సాయంత్రం
ఇష : 7.42 సాయంత్రం







# ఓ పిచ్చుకా ఎక్కడున్నావ్..?

## ఎడిటోరియల్

పెంపుడు పక్షులు కాకపోయినా మనుషుల మధ్య జీవిస్తాయి. మనం పండించే ఆహార ధాన్యాలపై ఆధారపడి జీవనం సాగిస్తాయి. సగటు మనిషికి ఏమాత్రం హాని చేయవు. పంట పొలాల్లో సంచరిస్తూ క్రిమి కీటకాలను తినడం వల్ల రైతులకు సస్యరక్షణ చర్యలు తగ్గిపోతాయి. పూర్వపు రోజుల్లో వాటి కోసం రైతులు ఇంటి గుమ్మం వద్ద కంకులను(జొన్న) వేలాడతీసేవారు. కాలక్రమేనా వ్యవసాయ రంగంలో చిరుధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. యాంత్రిక జీవనం అందుబాటులోకి వచ్చిన తరువాత పంట నూర్పిడికి ఉపయోగించే కల్లాలు కాలనీలుగా మారాయి. దీంతో పక్షి సంపద కూడా తగ్గిపోయింది. మరికొన్ని పక్షులు అడవి దారి పట్టాయి. గ్రామ సీమలకు అందాలని తెచ్చిపెట్టే పక్షులలో పిచ్చుక కూడా ఒకటి. అందుకే నేడు ఓ పిచ్చుకా ఎక్కడున్నావ్..అని ప్రశ్నించాల్సిన పరిస్థితి వచ్చింది. జాతీయ పక్షుల దినోత్సవం సందర్భంగా పక్షుల గురించి ఈ ప్రత్యేక కథనం.. పక్షులు ఎల్లప్పుడూ మన హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటాయి, అందుకే ప్రతి జనవరి 5 న జాతీయ పక్షుల దినోత్సవం సందర్భంగా వాటిని జరుపుకుంటాము..పక్షులు అద్భుతంగా ఉన్నప్పటికీ, అవి కూడా ప్రత్యేకమైన జంతువుల సమూహం. దేశవ్యాప్తంగా ప్రకృతి ప్రేమికులు, పక్షుల ప్రేమికులు, పక్షుల పరిశీలకులు ఏటా జనవరి 5 న జాతీయ పక్షుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచంలోని దాదాపు 10,000 పక్షి జాతులలో దాదాపు 12 శాతం అంతరించిపోయే ప్రమాదం ఉంది. అర మిలియన్లకు పైగా పక్షుల ఆరాధకులు జాతీయ పక్షుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. చాలా మంది పక్షుల ఔత్సాహికులు ఈ రోజున పక్షులను దత్తత తీసుకోవడం ద్వారా పక్షుల సంరక్షణలో ఉన్న ప్రత్యేక సమస్యల గురించి, పక్షుల యజమానులకు సరైన సంరక్షణ, శుభ్రత, ఆహారం అవగాహన కల్పించటం. " పకృలో సుమారు 10,000 జాతుల పక్షులు ఉన్నాయి. మన జాతీయ పక్షి నెమలిని స్మరించుకుందాం..రక్షించుకుందాం... మీ పెరటి స్టార్ కార్డినల్ అయినా లేదా ఉద్యానవనానికి తరలివచ్చే సాధారణ పావురాలు అయినా, పక్షులు ఎల్లప్పుడూ మన హృదయాల్లో మోహం, ప్రేమ మరియు ఆరాధనను కలిగి ఉంటాయి.ఒక డేగ ఎగురుతూ చూసేటప్పుడు మాత్రమే ఒక నిర్దిష్ట విస్మయం ఉంటుంది. దురదృష్టవశాత్తు, చాలా పక్షులు ప్రమాదంలో ఉన్నాయి. అక్రమ పెంపుడు జంతువుల వ్యాపారం కారణంగా జరుగుతున్నాయి.

పక్షుల నుంచి కొన్ని నేర్చుకుందాం.. రాత్రి తినవు, తిరగవు, తమ



పిల్లలను సరిగ్గా సమయానికి తగ్గట్టు అన్నీ నేర్పిస్తాయి. ఎక్కువగా తినవు. మీరు ఎంతైనా ధాన్యాలు వేయండి కొంచెం తిని ఎగిరిపోతాయి. తమతో ఏమీ తీసుకెళ్ళవు. తీసుకెళ్లినా పిల్లల కడుపునింపడానికే గానీ దాచుకోవడానికి కాదు. రాత్రి వస్తే నిద్రపోతాయి, ఉదయం త్వరగా లేస్తాయి, పాడుతూ ఉత్సాహంగా లేస్తాయి.తమ ఆహారాన్ని ఎప్పుడూ మార్చవు.స్వయంవరంతో జీవిత భాగస్వామిని ఎన్నుకుంటాయి. తమ శరీరంతో నిరంతరం పని చేస్తాయి. రాత్రి తప్ప విశ్రాంతి తీసుకోవు. అనారోగ్యం వచ్చినప్పుడు తినడం ఆపేస్తాయి, ఆరోగ్యం బాగున్నప్పుడు మాత్రమే తింటాయి. తమ పిల్లలకు పుష్కలమైన ప్రేమను ఇస్తాయి. ప్రకృతిలోంచి ఎంత అవసరమో అంత మాత్రమే తీసుకుంటాయి. తమ ఇంటిని పర్యావరణ అనుకూలంగా తయారు చేసుకుంటాయి. తమ భాష తప్ప వేరే భాష మాట్లాడవు. మనం కూడా వీటి నుంచి కొన్ని నేర్చుకుంటే జీవితం సాఫీగా, ఆనందంగా, విజయవంతంగా ఉంటుంది.



**గజ్జల వేంకట శేషారెడ్డి**
**సీనియర్ పాత్రికేయులు**
**పులివెందుల**

## గుంటూరు అభివృద్ధి చెందటం వైసీపీ నేతలకు ఇష్టం లేదు

**- ప్రజలిచ్చిన చారిత్రాత్మక తీర్పుతో వైసీపీ నాయకులకు మతి భ్రమించింది**
**- తాము ఇంకా అధికారంలో ఉన్నామనే బ్రాంతిలోనే వైసీపీ నేతలు**
**- పక్కా ప్రణాళికతోనే కౌన్సిల్ లో కమీషనర్ పై అసభ్యపదజాలంతో మాటల దాడి**
**- ప్రజాధనాన్ని వృధా చేయటం ముమ్మాటికి నేరమే**
**- అధికారులపై దాడి చేయటం వైసీపీ నేతలకు పరిపాటిగా మారింది**
**- ప్రజా ప్రతినిధులు అన్న పదానికే కళంకం తెస్తున్న వైసీపీ నేతలు**
**- ప్రజాస్వామ్యంలో వైసీపీ లాంటి రాజకీయ పార్టీ ప్రమాదకరం**
**- ఉన్నత పదవుల్లో ఉండి బజారు రౌడీల్లా ప్రవర్తిస్తున్న వైసీపీ నాయకులు**
**- అధికారుల్లోనూ... ప్రజా ప్రతినిధుల్లోనూ పారదర్శకత, జవాబుదారితనం ఉండాలి**
**- నగరపాలక సంస్థ అధికారులపై డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు అసభ్యకర వ్యాఖ్యలు సరికాదు**
**- గుంటూరు జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి**



**గుంటూరు, జనవరి 5 (జనస్వరం) :** తమకు అధికారాన్ని దూరం చేశారని ప్రజలపై కక్ష పెంచుకున్న వైసీపీ నేతలు ఎక్కడికక్కడ పరిపాలనను అడ్డుకుంటున్నారని, ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న గుంటూరు నగరం అభివృద్ధి చెందటం ఇష్టం లేకే వైసీపీ నేతలు కార్పొరేషన్ కౌన్సిల్ లో బీభత్సం సృష్టిస్తున్నారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కమీషనర్ పులి శ్రీనివాస్ తో పాటూ అధికారులను డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు అసభ్యపదజాలంతో దూషించటంపై ఆయన తీవ్రం అగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం అయన విలేకరుతో మాట్లాడారు. కౌన్సిల్ సక్రమంగా జరిగితే తమ ఐదేళ్ల తమ అవినీతి బాగోతాలు ఎక్కడ బయట పడతాయో అన్న భయంతోనే వైసీపీ నాయకులు సమావేశాలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఒక పద్ధతి ప్రకారం పక్కా ప్రణాళికతోనే డిప్యూటీ మేయర్ కమీషనర్ పై అసభ్యపదజాలంతో దూషించారని దుయ్యపట్టారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి గురించి చర్చించే కౌన్సిల్ సమావేశాలకు ఎంతో ప్రజాధనం ఖర్చు అవుతుందని, ప్రజాధనాన్ని ఎవరు వృధా చేసినా అది ముమ్మాటికి నేరమేనన్నారు. అధికారం పోవటంతో మతి భ్రమించిన వైసీపీ నేతలు అధికారులపై దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కడపలోఎంపీడీవో జవహర్ బాబు పై వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి భౌతిక దాడి మరువక ముందే గుంటూరు కమీషనర్ పై డిప్యూటీ మేయర్ అసభ్య పదజాలంతో దాడి చేయటం హేయమన్నారు. ప్రజా ప్రతినిధులు అన్న పదానికే వైసీపీ నేతలు కళంకం తెస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత పదవుల్లో ఉన్న వైసీపీ నేతలు బజారు రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో వైసీపీ లాంటి రాజకీయ పార్టీ అత్యంత ప్రమాదకరమన్నారు. ప్రజా ప్రతినిధులైనా, అధికారులైనా ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. అధికారులపై వైసీపీ నేతల దాడులను సహించబోమని, అధికారులకు జనసేన అండగా ఉంటుందని ఆళ్ళ హరి అన్నారు.

## అఖిల భారత నెట్ బాల్ టోర్నీకి కృష్ణా వర్సిటీ జట్టు

**విజయవాడ, జనవరి 5 (జనస్వరం) :** కృష్ణా విశ్వవిద్యాలయం నెట్‌బాల్ మహిళల జట్టును డా.ఎమ్.ఆర్.ఏ.ఆర్. కాలేజ్ అఫ్ పీజీ స్టడీస్ కళాశాల ప్రిన్సిపల్ డా.జె.నవీన లావణ్య లత ప్రకటించారు. ఎంపికైన ఈ జట్టు జనవరి 7 నుండి 9 వరకు జైపూర్ లోని సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీలో జరుగనున్న అఖిల భారత అంతర విశ్వావిద్యాలయాల నెట్‌బాల్ మహిళల టోర్నమెంట్ లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఎంపికైన జట్టు సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.శ్రావంతి, జి.రెచల్, కె.సాయి దుర్గా, టి.మౌనిక, కె.వల్లి శ్రీ, బి.లిఖిత (ఎస్.ఆర్.ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), సిహెచ్.శ్రీజ, జీ.ధనశ్రీ, వి.రమిత, బి.నవ్య (శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల), వి.శ్రీ వర్షిత (ఆంధ్రా లయోలా కళాశాల), ఎన్. లీల పద్మజ (డాక్టర్ ఎల్.హెచ్.ఆర్. గవర్నమెంట్ కాలేజీ). ఈ జట్టుకు కోచ్ గా డి.సత్యనారాయణ, మేనేజర్ డి.నవీన్ కుమార్ వ్యవహరిస్తారు. జట్టు సభ్యులకు కళాశాల వ్యాయామ విద్యా సంచాలకులు శశాంక్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



## మాజీ మంత్రి కాకానిపై సురేష్ నాయుడు ఫైర్

**సర్వేపల్లి, జనవరి 5 (జనస్వరం) :** నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కాకాని గోవర్ధన్ రెడ్డి తన అనుచరుడు వెంకట శేషయ్యను జైలు శిక్ష నుంచి బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సురేష్ నాయుడు ఆరోపించారు. వెంకట శేషయ్య నోరు తెరిస్తే తన ఆస్తుల అక్రమాలు బయటపడతాయని భయపడుతున్నారన్నారు. కాకాని గోవర్ధన్ రెడ్డి తన హయాంలో పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ బడుగు బలహీన వర్గాలపై అన్యాయంగా కేసులు నమోదు చేయించిన మొదటి వ్యక్తి అని సురేష్ నాయుడు ఆరోపించారు. సర్వేపల్లి నియోజకవర్గం ఐదు మండలాల్లో బడుగు వర్గాలపై పెట్టిన కేసులపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. "నాపై కూడా సమస్యలను ఎత్తి చూపినందుకు నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టించింది కాకాని మంత్రిగానే" అని సురేష్ నాయుడు తెలిపారు. "మీ హయాంలో బడుగు బలహీన వర్గాలపై నమోదు చేసిన కేసుల సంఖ్యను ప్రస్తుత కూటమి ప్రభుత్వంతో పోల్చి చూడటానికి సిద్ధమా?" అంటూ కాకాని గోవర్ధన్ రెడ్డిని బహిరంగ చర్చకు ఆహ్వానించారు. సురేష్ నాయుడు ఈ సందర్భంలో బడుగు వర్గాల హక్కుల పరిరక్షణ కోసం జనసేన పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## డొంకిన వలస, గంగూడి, గిల్లబడ్డు, రంగరాజు పల్లిలో పీసా ఎన్నికలు ఏకగ్రీవం

**హుకుంపేట, జనవరి 5 (జనస్వరం) :** మండలంలోని గన్నేరు పుట్టు పంచాయితీ పరిధిలోని డొంకిన వలస, గంగూడి, రంగరాజు పల్లి, గిల్లబడ్డు ప్రాంతాల్లో నిర్వహించిన పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. డొంకిన వలస పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా మజ్జి చిట్టిబాబు, కార్యదర్శిగా దూసూరు కర్రన్న ఎన్నికయ్యారు. ఈ విషయం ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలావతి వెల్లడించారు. ఇతర ప్రాంతాల నుంచి ఉపాధ్యక్షులుగా పాంగి హరికృష్ణ, గెమ్మెలి కామేష్, జన్ని అప్పలస్వామి, కార్యదర్శులుగా జంగిడి గణేష్, తామర్ల బుజ్జిబాబు, వలసబోయిని ప్రసాద్ లు ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు విప్లవ అభినందనలు తెలియజేశారు. ఎన్నికైన పెసా నాయకులు గిరిజన హక్కులు, చట్టాలు కాపాడడంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోకేలి కృష్ణారావు, మాజీ సర్పంచ్ దూసూరు కొండబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ మోహన్, వార్డ్ మెంబర్లు మజ్జి రాజారావు, వలసనైని వంశీ, మజ్జి బాబూరావు, మాజీ వార్డ్ మెంబర్లు జన్ని కొండలరావు, పనసబోయిని రజని, నాయకులు తామర్ల సుబ్బారావు పాల్గొన్నారు. అదనంగా, డీడీఓ యశోద, మహిళా పోలీస్ బేబి శ్యామిలీ, డీ ఏ లావణ్య, వెటర్నరీ అసిస్టెంట్ సన్యాసి రాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ గణేష్ వంటి అధికారులు, పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## "హైందవ శంఖారావం"కు జన ప్రభంజనం

**- హాజరైన విజయవాడ 35వ డివిజన్ జనసేన నాయకులు**

**విజయవాడ, జనవరి 5 (జనస్వరం) :** గన్నవరం విమానాశ్రయం సమీపంలో నిర్వహించిన హైందవ శంఖారావానికి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు ప్రదీప్ రాజు, ఉపాధ్యక్షురాలు బేబీ ప్రియదర్శిని, నవీన్ రాజ్, సుమన్ నాయక్, నవీన్ రాజు, భాస్కర్, సంపత్, బాబీ, ఇస్సాక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి క్రీడ పోటీల్లో రాణించిన ప్రభుత్వ ఉద్యోగస్తులు

**కూనవరం జనవరి 5 జనస్వరం :** నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ గచ్చిబౌలి స్టేడియం, హైదరాబాద్ నందు ఈ నెల నాలుగు ఐదు తేదీలలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలం శబరి కొత్తగూడెం గ్రామంకు చెందిన ఉద్యోగినులు వివిధ క్రీడలలో రాణించి మెడల్స్ సాధించినారు. పాయల భవాని, స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ టీచర్ కి రన్నింగ్ 400 మీటర్ల 40 సంవత్సరాల విభాగంలో కాంస్య పథకము సాధించగా, సరియం సునీత, నర్సింగ్ ఆఫీసర్ త్రిపుల్ జంప్ 35 సంవత్సరాల విభాగంలో కాంస్య పథకము సాధించారు.



## యల్లటూరు ముని కాంతమ్మ నేత్రదానం - ఇద్దరు అంధులకు చూపు



**పులివెందుల, జనవరి 5 (జనస్వరం) :** భర్త లక్షిరెడ్డి, కుమారులు చిరంజీవి రెడ్డి, గిరినాథ రెడ్డి, కుమార్తె లు మారుతీ దేవి, హైమావతి దేవి కోడలు శ్రీవాణి, అల్లుడు ప్రభాకర్ రెడ్డి, మనవళ్ళు హృతిక్ కుమార్ రెడ్డి, చేతన్ కుమార్ రెడ్డి లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు లకు సమాచారం ఇవ్వడం తో టెక్నీషియన్ హరీష్ తో కలిసి మృతురాలి ఇంటివద్ద పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి కి పంపినట్టు రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంధువులు లేదా సన్నిహితులు మరణించిన నేత్రదానం చేయదలచుకున్న వారు 9966609364 లేదా 7093204537 లకు సంప్రదించి మనిషి మరణానంతరం మట్టి లో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం అంధత్వం తో బాధ పడుతున్న అంధులకు చూపు ఇచ్చే బృహత్కార్యం ప్రతి కుటుంబం ఒక సంప్రదాయం గా అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.



## పన్నర్స్ అభిరామ్ పుట్టినరోజున రక్తదాన శిబిరం అభినందనీయం : డాక్టర్ దీపిక రెడ్డి

**పులివెందుల, జనవరి 5 (జనస్వరం) :** పులివెందుల పట్టణం నగరిగుట్ట కి చెందిన తిరుమలేశ్వరి, చలపతి దంపతుల కుమారుడు అభిరామ్ 8 వ పుట్టినరోజు సందర్భంగా నగరిగుట్ట లోని గంగమ్మ దేవాలయం వద్ద అభిరామ్ పుట్టినరోజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం లో చలపతి కుటుంబ సభ్యులు, సన్నిహితులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలను రక్తనిధి మెడికల్ అధికారి డాక్టర్ దీపిక రెడ్డి, వైయస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వీరారెడ్డి లు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీపిక రెడ్డి మాట్లాడుతూ అభిరామ్ ప్రతి ఏడాది పుట్టినరోజు నాడు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అని,రక్తదానం తో ప్రాణ దాతలు అవుతారని, చలపతి, తిరుమలేశ్వరి దంపతులను ఆదర్శం గా తీసుకుని పుట్టినరోజు వేడుకలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రాణ దాతలు అవ్వాలన్నారు.18 సంవత్సరాలు నిండిన యువత ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో రక్తనిధి సిబ్బంది అన్నమ్మల్,ప్రభావతి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



## నిలోఫర్ ఆస్పత్రి వద్ద అనాధలకు రోగులకు అన్నదాన కార్యక్రమం

**హైదరాబాద్, జనవరి 06 జనస్వరం :** రెడి టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు నిలోఫర్ హాస్పిటల్ ఆవరణలో పేదలకు ఉచిత ఆహారం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుప్రజా హాస్పిటల్ జీఎం అజయ్ కుమార్ గౌడ్, సినీ రచయిత శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. చైర్మన్ పెద్ది శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో పేద ప్రజల కోసం రెడి టూ సర్వ్ ఫౌండేషన్ గత పది సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అలాగే ఈ సంస్థ గత ఐదేళ్లుగా వృద్ధాశ్రమాలకు సహాయం అందిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, సుప్రజా హాస్పిటల్ ప్రతినిధి ప్రకాష్, కోఆర్డినేటర్ చైతన్య, పిఆర్వో రాజు లక్ష్మణ్, పూజ తదితరులు పాల్గొన్నారు.





## జాలి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్

**సీతారామపురం, జనవరి 5, జనస్వరం :** సంక్రాంతి పండుగ సందర్భంగా సీతారామపురంలో ఆదివారం జాలి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తోట మనోహర్, వేద గర్భ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ దాసరి నరేష్, స్కూల్ డైరెక్టర్ కనుమలపూడి పవన్ కుమార్ హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో బహుమతుల దాతలుగా మొదటి బహుమతిని (₹20,000) తోట మనోహర్ తోట నాగార్జున జ్ఞాపకార్థంగా ప్రకటించారు. రెండవ బహుమతి (₹10,000) జాలి ఫ్రెండ్స్ వాలీబాల్ ప్లేయర్స్, మూడవ బహుమతి వేద గర్భ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బృందం అందించారు. మొదటిరోజు మ్యాచ్‌లో మారం రెడ్డిపల్లి జట్టు మరియు బెస్త కాలనీ సీతారామపురం జట్టు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌కు సీతారామపురంలోని క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తికావడంతో జాలి ఫ్రెండ్స్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



# సెర్వికల్ క్యాన్సర్ అవగాహన, ఉచిత స్క్రీనింగ్ క్యాంపును హాస్పిటల్ - బసవతారకరామ హాస్పిటల్

**హైదరాబాద్, జనవరి 06 (జనస్వరం) :** జనవరి నేల ను ప్రపంచ సెర్వికల్ క్యాన్సర్ అవగాహన నెల గా నిర్వహిస్తారు, ఈ సందర్భంగా సెర్వికల్ క్యాన్సర్ అవగాహన, ఉచిత స్క్రీనింగ్ క్యాంపును హాస్పిటల్ లో ఏర్పాటు చేశారు. ఈ ఉచిత సెర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ను సోమవారం 06 జనవరి 2025 నుండి 31 జనవరి 2025 వరకు అన్ని పని రోజులలో ఉదయం 10.00 నుండి 1.00 గంటల వరకు బ్లాక్ I మొదటి అంతస్తులోని సర్జికల్ విభాగం లో నిర్వహించబడును. క్యాన్సర్ ను ఎలా నివారించాలి అన్న అంశంపై ప్రజలలో అవగాహన కలిపించడానికి ఈ సర్వికాల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఉద్దేశించారు. ఈ క్యాంపులో వైద్యులు ఉచితంగా ప్రాథమిక పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ లక్షణాలను నిర్ధారించే ప్రయత్నం చేస్తారు. అనుమానం ఉన్న వారికి ఫ్యాప్స్మియర్ టెస్టు ను 50% శాతం డిస్కౌంట్ ,తో పాటు ఇతరత్రా వ్యాధి ఇర్ధారణ పరీక్షలు 20 % డిస్కౌంట్ తో చేస్తారు. ఈ సదుపాయాన్ని అవసరమయిన వారు, వినియోగించుకోవాలని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యం విజ్ఞప్తి చేస్తోంది. మరిన్ని వివరాల కోసం 040-23551235 extn 2335, 2354,2216 లో సంప్రదించవచ్చు.




# బ్రెయిలీ జయంత్యోత్సవాల సందర్భంగా రూరల్ సీఐ ఎన్వీ రమణ దివ్యాంగులకు నిత్యావసరాల వితరణ

**- అంధుల ఆశాజ్యోతి లూయి బ్రెయిలీ : డీఎస్పీ మురళి నాయక్**

**పులివెందుల, జనవరి 5 (జనస్వరం) :** 1809లో ఫ్రాన్స్ దేశంలోని ప్యారిస్ సమీపంలో క్రూవే అనే ఒక చిన్న కుగ్రామంలో జన్మించిన లూయిస్ బ్రెయిలీ , తనచిన్నవయసులోనే రెండుకళ్ళను కోల్పోయినప్పటికీ , తన అసాధారణ ప్రతిభాపాటవాలతో , నిరంతర కృషితో ఆరుచుక్కల స్పర్శతో కూడిన ప్రత్యేక లిపిని కనుగొని, తానుచీకటిలో ఉండికూడా తనతోటి అంధులకు వెలుగులు ప్రసాదించేందుకు, అహర్నిశలు కృషిచేసి, తాను క్రొవ్వొత్తిలా కరిగిపోతూ, చూపులేనివారికి వెలుగులు చూపారని , బ్రెయిలీ స్ఫూర్తితోనే, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో తన బాల్యమిత్రుడు, అంధుడైన శ్రీనివాసులుకు తాను అన్నిరకాలుగా తోడ్పాటునందించే వాడినని, పులివెందుల నియోజకవర్గ వికలాంగులు తమసమస్య ఏదైనా, నిస్సంకోచంగా తనను కలిసి పరిష్కరించుకోవచ్చని, వికలాంగుల హక్కుల చట్టం -2016 ప్రకారం దివ్యాంగులను ఇబ్బంది పెట్టేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, పులివెందుల పోలీసుశాఖ తరపున రూరల్ సీఐ ఎన్వీ రమణ బ్రెయిలీడే సందర్భంగా దివ్యాంగులకు చేయూతనివ్వడం అభినందనీయమని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ పేర్కొన్నారు.

అంధులలిపి ప్రదాత లూయి బ్రెయిలీ 216వ జయంత్యోత్సవాలలో భాగంగా పులివెందులపట్టణం ముద్దనూరురోడ్డులో ఉన్న వికలాంగులకమ్యూనిటీభవనంలో, పులివెందుల రూరల్ సీఐ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంధుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ మురళి నాయక్, సీఐ తదితరులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సీఐ ఆర్థిక సాయంతో ముప్పైవేల రూపాయలు విలువజేసే నిత్యావసర సరుకులను 30 దివ్యాంగుల కుటుంబాలకు డీఎస్పీ చేతులమీదుగా పంపిణీ చేశారు. అంతకుమునుపు దివ్యాంగుల మధ్య బ్రెయిలీ జన్మదినోత్సవ కేకు కట్ చేసి అందరికీ అందజేశారు. ఈసందర్భంగా వికలాంగుల నెట్ వర్క్ ఆధ్వర్యంలో దివ్యాంగులు డీఎస్పీ, సీఐ లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంధులను అభ్యుదయ వివాహం చేసుకున్న చిన్న, ప్రమీలను అభినందిస్తూ, ఆదర్శ అంధ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం వికలాంగుల శిక్షణా కార్యక్రమాలకు తనవంతు పదివేల రూపాయలు విరాళం అందిస్తున్నట్లు డీఎస్పీ మురళి నాయక్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకట సుబ్బయ్య, సునీల్, కానిస్టేబుల్ పురుషోత్తమరెడ్డి, సంఘసేవకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరుకులను చేరవేయడంలో హామాలీలు పాత్ర ఎంతో కీలకం

**భైంసా జనవరి 05 జనస్వరం :** పౌర సరఫరాల శాఖ హమాలీలకు కుదిరిన ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంబందించిన హమాలిలకు కూలి రేట్లు పెంచాలని భైంసా పట్టణంలోని గోడం దగ్గర హమాలీలు ధర్నా చేస్తూన్న నేపథ్యంలో జిల్లా రేషన్ డీలర్ సంక్షేమ సంఘం తరపున లోకేశ్వరం డీలర్ మగ్గిడి గంగాధర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మగ్గిడి గంగాధర్ మాట్లాడుతూ :ప్రతి రోజూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు, హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనం నిర్వహించే పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు నిత్యావసర సరుకులను చేరవేయడంలో వీరి పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి రెండేండ్లకు ఒకసారి హమాలీ రేట్ల ఒప్పందంజరుగుతుందనీ, గతంలో చేసిన ఒప్పంద గడువు 2023 డిసెంబర్‌తో ముగిసిందని గుర్తుచేశారు. నూతన రేట్ల ఒప్పందం 2024 జనవరి ఒకటి నుంచి అమలు చేయాల్సి ఉందని తెలిపారు. కేవలం సివిల్ సప్లైస్ అధికారులు నిర్లక్ష్యంతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు అవకాశాన్నిఅంటుతున్నాయని ప్రతి రెండేళ్లకు ఒక సారి కూలీ రేట్లు అగ్రిమెంట్ ప్రకారం పెంచాల్సి ఉన్నా ఎనిమిది నెలలుగా ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ లోకేశ్వరం మండలధ్యక్షులు సాయరెడ్డి భైంసా నాయకులు షేరఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# పరిహారం చెల్లింపు చంద్రబాబుకే సాధ్యం : ఎమ్మెల్యే శిరీష దేవి కృషి ఫలించింది

**వరరామచంద్రాపురం, జనవరి 5, జనస్వరం :** రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ సభ్యురాలు మిరియాల శిరీష దేవి తొలిసారిగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ముంపు సమస్యలు, మరియు వరదల సమయంలో ప్రజల ఎదుర్కొంటున్న బాధలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఆమె వి ఆర్ పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లో పర్యటించి, ముంపు గ్రామాలలో ప్రతి కుటుంబాన్ని కలుసుకుని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తదుపరి అసెంబ్లీలో తన గట్టిగళంతో ముంపు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయడం జరిగింది. ముఖ్యంగా, పోలవరం ఆర్ అండ్ ఆర్ సమస్యకు శిరీష దేవి చొరవతో చంద్రబాబు ఆలోచనల మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మొదటి అడుగులు వేయడంతో సమస్య పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా, మండల పార్టీ కార్యాలయంలో, మండల ప్రధాన కార్యదర్శి బురక కన్నారావు, జడ్పీటీసీ సభ్యుడు వల్ల రంగా రెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, మరియు ఇతర మండల కమిటీ సభ్యుల సమక్షంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫోటోకు తెలుగుదేశం శ్రేణులు పాలాభిషేకం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలలకే, పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం ₹815 కోట్లు విడుదల చేయడంతో పాటు, 41:15 కంటూరులోని గ్రామాలలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీను బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. మాజీ వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేస్తూ, ముంపు ప్రజల సమస్యలను పరిష్కరించకపోగా, కేంద్ర ప్రభుత్వంపై నెట్టడం మాత్రమే చేసి ముంపు ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు అకోజు భాగ్యలక్ష్మి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్రా నరేష్ కుమార్, అరకు పార్లమెంట్ రైతు విభాగ కార్యదర్శి కోట్ల బాలయ్య, ఎస్టీ సెల్ కార్యదర్శి పాయం రామారావు, వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్యప్రకాశ్ రావు, ఎస్సీ సెల్ కార్యదర్శి అల్లాడి అచ్చిరాజ్, మాజీ మండల అధ్యక్షుడు చంద్రయ్య, దేవస్థానం చైర్మన్ బొర్రా ఆదినారాయణ, బూత్ కన్వీనర్ రేవు సింహాచలం, విద్య కమిటీ చైర్మన్ ముత్యాల శంకర్రావు, మరియు ఇతరులు పాల్గొన్నారు.



# భీమడోలు బార్ అసోసియేషన్ సభ్యులు ప్రసాద్ బాబు మృతి



**భీమడోలు, జనవరి 5 ( జనస్వరం) :** భీమడోలు బార్ అసోసియేషన్ సభ్యులు అర్జ వారి గూడెం గ్రామస్తులు, ప్రముఖ న్యాయవాది గొటికల ప్రసాద్ బాబు ఆదివారం అర్ధరాత్రి ఏలూరు వైద్యశాలలో మృతి చెందారు. ఆయనకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు .ఇద్దరు కుమారులు న్యాయవాదులు. ఒక కుమారుడు ఇంజనీర్. ప్రసాద్ బాబు మృతి పట్ల భీమడోలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈదా వెంకటరత్నం న్యాయవాదులు కాలి నాగేశ్వరరావు, కాళీ గంగరాజు, పి రాజారామ్ ,ఇతర న్యాయవాదులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు, స్నేహితులు సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం సాయంత్రం ప్రసాద్ బాబు అంత్యక్రియలు అర్జవారిగూడెంలో జరిగాయి.

# కొమ్మిక గింజార్తి రోడ్డును బాగు చేయండి మహాప్రభో



**కొయ్యూరు, జనవరి 5, జనస్వరం :** అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం గల కొమ్మిక పంచాయతీలో కొమ్మిక నుండి గింజార్తి మార్గంలో గింజర్తి ఘాటీ దగ్గర రోడ్డు శుభ్రం పాడైపోయి 10 సంవత్సరాలు అయినా పట్టించుకోని అధికారులు, తీవ్ర ఇబ్బంది లో గిరిజన ప్రజలు, కనీసం మరమ్మత్తులకు నోచుకొని రీతిలో గింజార్తి ఘాటీ,పలు పంచాయతీల నుండి మండల హెడ్ క్వార్టర్ కు షార్ట్ కట్ అయినా కనీసం దారి సౌకర్యం బాగోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు పంచాయతీ ప్రజలు వాపోతున్నారు, కూటమి ప్రభుత్వం లో అయినా ఈ మార్గానికి మోక్షం కలిగే అంటున్న ప్రజలు, దయచేసి ఈ ప్రభుత్వంలో అయినా ఈ రహదారి సమస్య పరిష్కరిస్తారని పత్రిక ముఖంగా తెలియజేసుకుంటున్నాము అని పలు పంచాయతీ ప్రజలు విన్నపించుకున్నారు.

# హైందవ శంఖారావానికి భారీ సంఖ్యలో తరలి వెళ్లిన చీరాల వాసులు



**చీరాల, జనవరి 05, జనస్వరం :** హిందూ పరిషత్ చీరాల శాఖ ఆధ్వర్యంలో సుమారు 1,500 మందికి పైగా హిందూ బంధువులు, అభిమానులు, కార్యకర్తలు హైందవ శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు చీరాల నుంచి బస్సులు మరియు ఇతర వాహనాల ద్వారా విజయవాడకు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేవాదాయ శాఖను రద్దు చేసి, దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారి ఈ వినూత్న కార్యక్రమం ప్రారంభించారని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమ నిర్వాహకులుగా బీజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు బండారుపల్లి హేమంత్ కుమార్, ఆర్.ఎస్.ఎస్., విశ్వహిందూ పరిషత్, బీజేపీ సభ్యులు గుగ్గిలం తులసిరావు, కొర్నిపాటి మహేష్, ప్రసాద్, చుండూరు అశోక్, గౌరాబత్తిని నాగరాజు, బీజేవైఎం బాపట్ల అధ్యక్షుడు నాశన మణికుమార్, బీజేవైఎం బక్కా మనోహర్ రెడ్డి, బీజేపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు మువ్వల వెంకట రమణా రావు, ఏపీ బీజేపీ ఓబీసీ సభ్యులు నాసిక శివాజీ, బీజేపీ చీరాల పట్టణ అధ్యక్షుడు శంకర్ శెట్టి నాగేశ్వరరావు, బీజేపీ చీరాల అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్, భరణీ రావు, బీజేపీ జిల్లా నాయకులు తడవర్తి చంద్ర, దేవాంగ సంక్షేమ బాపట్ల జిల్లా సెక్రటరీ యారాసు అరుణ్ బాబు, బీజేవైఎం మహిళా మోర్చా గుద్దంటి భవాని, పెరుమాళ్ళ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# కోటంరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో షేక్ అబ్దుల్ అజీజ్ కు ఆత్మీయ సన్మాన సభ

**నెల్లూరు, జనవరి 5, జనస్వరం :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్‌కు ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సి.వి. శేషా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తులో అబ్దుల్ అజీజ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. బీదా రవిచంద్ర మాట్లాడుతూ, "నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఒక మంచి నాయకత్వం కలిగిన ప్రాంతం. నిరంతరం ప్రజల కోసం పనిచేసే నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన 36 వేల భారీ మెజారిటీతో విజయం సాధించారు" అని తెలిపారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, "నేను మేయర్ కావడానికి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కృషి చాలా ఉందని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. రాబోయే ఎన్నికల్లో ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని మనస్ఫూర్తిగా ఆ దేవుని ప్రార్థిస్తున్నాను. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉండే వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఒకే నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం సాధారణ విషయం కాదు; ఇది కోటంరెడ్డి బ్రదర్స్‌కి మాత్రమే సాధ్యమైంది" అని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# హాస్టల్ భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

**సీలేరు, జనవరి 5, జనస్వరం :** జీకే వీధి మండలం సీలేరు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వసతి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2012లో పోస్ట్ మెట్రిక్ హాస్టల్ బాయ్స్ మంజూరు అయినప్పటికీ ఇప్పటివరకు హాస్టల్ భవనం నిర్మాణం చేపట్టలేదు సీలేరు గ్రామం మాత్రమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ఎక్కువ మంది విద్యార్థులు కళాశాలకు వస్తున్నారు. అయితే, వసతి సౌకర్యం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులను, కళాశాల యాజమాన్యాన్ని వసతి గృహం నిర్మాణం కల్పించాల్సిందిగా కోరుతున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వి. శంకర్రావు మాట్లాడుతూ, "హాస్టల్ భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తాం. వీలైనంత త్వరగా వసతి గృహాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని" తెలిపారు.



# 7 నుండి విద్యుత్ చార్జీల ప్రతి పాదన(టారిఫ్) లపై ప్రజాభి ప్రాయ సేకరణ.-- వివరాలు వెల్లడించిన విద్యుత్ శాఖ ఈ.ఈ. కె.జాన్ థామస్

**చీరాల, జనవరి 05, జనస్వరం :** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఈనెల 7, 8, 10 తేదీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల (టారీఫ్) ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈ.ఈ. కె. జాన్ థామస్ తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడ బ్రిందావన్ కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో, అలాగే 10వ తేదీన కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో, ఉదయం భౌతికంగా మరియు మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరగనుందని వివరించారు. వినియోగదారులు తమ అభ్యంతరాలు లేదా అభిప్రాయాలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చీరాల ఏ.డి.ఈ. బి. హరిప్రసాద్ రావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా గెడ్డమూరి నానాజీ



**పాయకరావుపేట, జనవరి 5, జనస్వరం :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా మండలంలోని కేశవరం గ్రామానికి చెందిన గెడ్డమూరి నానాజీ ని య మి తు ల య్యా రు . ప్రస్తుతం విలేఖరిగా పనిచేస్తూనే హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా సేవలు అందిస్తున్నారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీలో అనకాపల్లి జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సంధర్భంగా నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ చంటి ముదిరాజ్ చేతులు మీదుగా ఆర్డర్ కాపీని పంపించి గెడ్డమూరి నానాజీని నియమించారు. జిల్లా కలక్టరు ఆదేశాలతో అన్ని గవర్నమెంటు ఆఫీసుల్లోనూ అన్ని విధాలా సహకరించేలా ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు.

# నేడు, రేపు మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం



**కొడంగల్ , జనవరి 5( జనస్వరం) :** బొంరాస్ పేట,దుద్యాల, దౌల్తాబాద్ ,కొడంగల్ మండలాల పరిధిలోని గ్రామాలకు సోమ, మంగళవారాల్లో రెండు రోజులపాటు మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కొడంగల్ మిషన్ భగీరథ డిఈ శేషాంక్ మిశ్రా ,ఏఈఈ హర్షిత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరిదేవిపల్లి పంప్ హౌస్ లో నిర్వహణ పనుల నిమిత్తము నిలిచిపోయే నీటి సరఫరా అంతరాయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు త్రాగునీటి కోసం తగు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

# రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల ప్రకారం ప్రతి కౌలు రైతుకు రూ.2 లక్షలు పంట రుణం ఇవ్వాలి

**ఏలూరు జనవరి 5 ( జనస్వరం) :** రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల ప్రకారం కౌలు రైతులకు రబీ పంట రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పవర్ పేట అన్నే భవనంలో కౌలు రైతులకు పంట రుణాల సమస్యలపై అయన మాట్లాడారు. బ్యాంకర్లు అనేక నిబంధనలు పెట్టి కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదని చెప్పారు. వ్యవసాయదారులకు ఎటువంటి హామీ లేకుండా పంట రుణాల పరిమితిని రూ.లక్ష 60 వేల నుండి రూ.రూ.2 లక్షల వరకు పెంచిందని చెప్పారు. రిజర్వ్ బ్యాంకు ఆదేశాల ప్రకారం ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కు అనుగుణంగా రూ. 2 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. భూ యజమాని పంట రుణం పొందారనే పేరుతో కౌలు రైతుకు మొండి చేయి చూపడం తగదన్నారు. పంట సాగుదారు హక్కు పత్రాలు పొందిన ప్రతి కౌలు రైతుకు పంటలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీలో కౌలు రైతుల పంట రుణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయిస్తూ ఆదేశాలిస్తున్న ఆచరణలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంట సాగు ద్వారా హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులు బ్యాంకుల వద్దకు వెళ్లి ఉన్నారు ఇవ్వాలని బ్యాంకర్లను ఒత్తిడి చేయాలన్నారు. అది వడ్డీలకు అప్పులు చేసి వ్యవసాయ పెట్టుబడులు పెట్టడం వలన కౌలు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా నూతన కౌలు చట్టం తీసుకువచ్చి కౌలు రైతులకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల రుణాలు కోసం బ్యాంకుల ముందు ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.




# నారాలోకేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగడ నాగేశ్వరరావు



**యలమంచిలి జనవరి 5 జనస్వరం :** ఈనెల 8న విశాఖపట్నంలో పలు ప్రాజెక్టుల శంకుస్థాపన కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన రివ్యూ మీటింగ్ అనంతరం, తిరుగు ప్రయాణంలో తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మరియు ఆర్టీజీఎస్ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్‌ను విశాఖపట్నం విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసిన వారు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ మరియు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

# గ్రామీణ తపాల జీవిత భీమా ప్రీమియం సేకరణలో ఉద్యోగులకు రాష్ట్రస్థాయిలో బహుమతులు

**ఏలూరు, జనవరి5 (జనస్వరం) :** ఏలూరు డివిజన్ తపాలా ఉద్యోగులు తపాలా జీవిత బీమా మరియు గ్రామీణ తపాల జీవిత బీమా ప్రీమియం సేకరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో నాలుగు బహుమతులు సాధించారని జిల్లా సూపరిండెంట్ శ్రీకర్ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి విజేతలకు అభినందన సభ మరియు తపాలా ఉద్యోగులతో సమీక్ష సమావేశం అదేవిధంగా ఏలూరు జిల్లా డివిజన్ కు సంబంధించి పొదుపు ఖాతాల మేళ ఈనెల 7వ తారీఖున మానవతా ఫంక్షన్ హాల్, గురవాయిగూడెం, జంగారెడ్డిగూడెం నందు సాయంత్రం నిర్వహిస్తామని తెలియజేశారు. అదేవిధంగా ఏలూరు జిల్లాలో తపాలా జీవిత బీమా ప్రీమియం సేకరణ మరియు పొదుపు ఖాతాల సేకరణలో అత్యుత్తమ ప్రతిభ కలిగిన తపాలా ఉద్యోగులకు సన్మానిస్తామని తెలియజేశారు.దీంతోపాటు సదరు సమీక్ష సమావేశంలో ఉద్యోగులకు ఒత్తిడి లేకుండా పనిచేయుట,మానసిక స్వాంతన..మొదలు అంశాలపై శిక్షణ ను కూడా సదరు సమీక్ష సమావేశంలో ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. డిసెంబర్ నెలలో ఏలూరు డివిజన్ తపాల ఉద్యోగులు సుమారు కోటి రూపాయలు ప్రీమియం వరకు సేకరించారని తెలియజేశారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ తో తపాల జీవిత బీమా



పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అందరూ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, ఇన్కమ్ టాక్స్ కన్సషన్ కూడా దీనివల్ల వర్తిస్తుందని తెలియజేశారు. తపాలా శాఖ పూర్తిస్థాయిలో ఆన్లైన్లో లావాదేవీ నిర్వహిస్తున్నదని, తపాలా శాఖలో ఎస్బిఐ అకౌంట్ ఓపెన్ చేసినచో ఎక్కడి నుంచి అయినా దాన్ని నడిపించుకోవచ్చు అని తెలియజేశారు. అదేవిధంగా ఈ జనవరి 24వ తేదీన.. జాతీయ బాలిక దినోత్సవ సందర్భంగా పది సంవత్సరాల లోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి ఖాతాలో తెరిచే విధంగా ఆరోజు జిల్లా వ్యాప్తంగా డ్రైవ్ నిర్వహిస్తామని తెలియజేశారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్



**యలమంచిలి జనవరి 5 జనస్వరం :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యలమంచిలి కొత్తపేట హైస్కూల్ లో పదవ తరగతి విద్యార్థులకు ఆదివారం నాడు నమూనా పరీక్ష నిర్వహించడం జరిగింది. నమూనా పరీక్షలో భాగంగా ప్రశ్న పత్రాన్ని జిల్లా కార్యదర్శి విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్ష భయాందోళన పోవడానికి మరియు వారిలో ప్రతిబిన బయటికి తీసేందుకే ఈ పరీక్షను నిర్వహించడం జరిగిందని ఈ పరీక్షలో సుమారుగా 14 స్కూల్ నుండి 800 విద్యార్థులు పాల్గొనడం జరిగిందని ఆయన అన్నారు. విద్యార్థులు పరీక్షలు పట్ల అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, విద్యార్థులు యువకులు చెడు లక్షణాలు అలవాటు పడవద్దని మంచిగా చదువుకొని మంచి భవిష్యత్తు ఎదగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉపాధ్యాయులు ఎం. సుధారాణి మాట్లాడుతూ ఈ పరీక్షలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, నేడు యువతీ యువకులంతా చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఎదగాలని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు మంచి బాటలో పయనించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ మండల, అధ్యక్షకార్యదర్శి లు అభి, మణికంఠ, డివిజన్ నాయకులు రామలక్ష్మణులు, శ్రీను, కృప, శ్రీను, రాఘవేంద్ర, సునీల్, ధర్మ రాజు, రాజేష్, శరణ్య జాను, హేమ, సత్య, పీజీ, బీఈడీ చదువుతున్న విద్యార్థులు ఇన్విజిలేషన్ చేయడం జరిగింది.

# ప్రతి నీటి బొట్టు .. బంగారమే పొదుపుగా వాడుకుందాం

నీటిని పొదుపుగా వాడేవారు ధనాన్ని కూడా పొదుపుగా వాడుతారట! నీటిని దుబారా చేసే వారు డబ్బును కూడా అలానే దుబారా చేస్తారట. ఈ భూమి మీద లభిస్తున్న మొత్తం నీటిలో 97 శాతానికి పైగా సముద్రజలం. అది ప్రాణులకు ప్రత్యక్షంగా ఉపయోగపడేది కాదు. మరో రెండు శాతానికి పైగా మంచు రూపంలో ఉంది. మిగిలిన ఒక్క శాతంకన్నా తక్కువే ప్రాణులకు పనికివచ్చేది. అదే మంచినీరన్న మాట! ఇప్పుడా మంచినీటికి పెద్ద ముప్పు ఏర్పడింది. అధిక జనాభా తదితర వాస్తవాల వల్ల నీటి వినియోగం పెరిగి చాలీచాలని పరిస్థితి ఒకటైతే, దారుణమైన కాలుష్యం మరొకటి! వాతావరణం కాలుష్యం పెరిగి మంచుమీద ఒత్తిడి మొదలైంది. భూగోళం మీది సమతుల్యానికి మంచు కూడా ఒక ఆధారం. అది కాస్తా కరిగిపోతే, జలప్రళయం సంభవించి నేల తుడిచిపెట్టుకు పోతుంది. నీరే మన జీవనానికి ఆధారం. నదీ పరివాహక ప్రాంతాలలోనే నాగరికత, సంస్కృతీ అభివృద్ధి చెందటం మనకు తెలిసిన విషయమే! నీరు మనకు ఆహారం. నీరే మనకు ఆధారం. రవాణా వ్యవస్థకు కూడా మనం నీటిని వాడుకుంటున్నాం. నీటి కోసం జరుగుతున్న ఉద్యమాలను చూస్తున్నాం. రాబోయే కాలంలో వచ్చేవి 'జలయుద్ధాలే'! ప్రకృతితో ఇకనైనా పరిహాసాలు ఆపేసి, ప్రకృతి వనరులను అతి పవిత్రంగా చూసుకోవటం నేటి మన తక్షణ కర్తవ్యం. అడవులను ఆక్రమించుకుంటున్నాం. స్మశానాలను ఆక్రమించుకుంటున్నాం. చెరువులు ఇతర జలాశయాలను నగరాల్లో ఎప్పుడో ఆక్రమించారు హిరణ్యాక్షుడివర ప్రసాదులు! నిజం చెప్పాలంటే మనమే నీటిని తరిమివేసాం. చాలా నదులు అంతర్ధానం అయిపోయి, అంతర్వాహినులుగా ఉన్నాయి. వాటిలో మన రాష్ట్రంలోని శ్రీ కాళహస్తిలోని సువర్ణముఖి నది ఒకటి.

ఇటువంటి నదులు మనదేశంలో షుమారు 50కి పైగా ఉన్నాయని అంచనా! భూమిలోకి వెళ్ళిపోయిన ఆరావళీ పర్వత ప్రాంతాలలో శుష్కించిపోయిన అయిదు నదులను బతికించిన 'జలబ్రహ్మ' జలభాష, ఘోషను అర్ధం చేసుకోగల మహామనీషి, రామన్ మెగసెసే అవార్డ్ గ్రహీత, తరుణ్ భారత్ సంఘ్ అధినేత అయిన శ్రీ రాజేంద్రసింగ్ ను గురించి మనలో ఎంతమందికి తెలుసు? క్షామపీడిత గ్రామసీమలకు నీటిని రప్పించి సస్యశ్యామలం చేసిన జలదాత ఆ మహానుభావుడు! ఆయన స్ఫూర్తితో తెలుగులో 'జలగీతం' అనే 110 పుటల దీర్ఘ కవితను(తెలుగులో వచ్చిన మొదటి దీర్ఘ కవిత ఇదే!) అద్భుతంగా వ్రాసి ఎందరినో ఉత్తేజపరచిన డాక్టర్. యన్. గోపి గారు. మనకు రోజుకి కనీసం 30-50 లీటర్ల పరిశుభ్రమైన, సురక్షితమైన నీరు అవసరం. కానీ ఇప్పటికీ 88. 4 కోట్ల మంది ( 884 మిలియన్ల మంది) ప్రజలకు సురక్షితమైన నీరు అందుబాటులో లేదు. వేసవి వస్తోందంటేనే భయమేస్తోంది. నీటి కొరత దడ పుట్టిస్తుంది. బిందెలతో బారులు తీరే జనాలు కనిపిస్తారు. నీరు లభించని ప్రాంతాలలో ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. భూమి ఏర్పడినప్పుడు ఎంత నీరు ఉందో ఇప్పుడూ అంతే ఉంది. పెరగడం కానీ తరగడం కానీ కాలేదు. కానీ ఆ నీటిని వాడుకునే వారి జనాభా మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది నీటి కోసం కటకటలాడుతున్నారు.

ఉన్న మంచినీటిని మనం పొదుపుగా వాడకపోగా కలుషితం కూడా చేస్తున్నాం. ప్రపంచంలో 500కు పైగా మంచినీటి నదులు కలుషితమైపోయాయి. ప్రపంచంలో భారీ యుద్ధాల్లో చనిపోయిన వారి కన్నా, కలుషిత నీటి వల్ల మరణించిన వారే ఎక్కువ. ఏడాదికి 40 లక్షల మంది కలుషిత నీరు తాగి చనిపోతున్నారు. ఒక కిలో బియ్యాన్ని పండించడానికి 5000 లీటర్ల నీరు అవసరమవుతుంది. అరకిలో కాఫీ తయారవడానికి 11, 000 లీటర్ల నీరు అవసరం. కార్పొరేట్ కంపెనీలు ఆరోగ్యానికి హాని కలిగించే శీతల పానీయాల కోసం వృధా చేస్తున్న మంచి నీటికి ఇక లెక్కే లేదు. కొన్ని రాష్ట్రాలు ఈ శీతల పానీయాలను నిషేధించాలని కూడా చూస్తున్నాయి. ప్రపంచ జనాభాలో భారత్ జనాభా 16 శాతంగా ఉంది. కానీ ప్రపంచ నీటి వనరుల్లో భారత నీటి వనరులు కేవలం నాలుగు శాతంగానే ఉన్నాయి. ప్రస్తుతమున్న వెయ్యి మిలియన్ల జనాభాకు తలసరి నీటి లభ్యత సంవత్సరానికి ఒక్కో వ్యక్తికి 1. 170 క్యూబిక్ మీటర్లుగా ఉంది. తీవ్రంగా ఉన్న నీటికొరత అవసరాలకు వాడుకునే వారి మధ్య ఘర్షణలకు దారి తీస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సమీప భవిష్యత్తులో నీటి యుద్ధాలు ఖాయమని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. మన దేశంలో మాత్రం ఇప్పటికే నదీ జల వివాదాలు తలెత్తుతున్నాయి. జల వివాదాలకు పెరుగుతున్న నీటి వినియోగమే ప్రధాన కారణం. వర్షాలు తగ్గడం, నదీ ప్రవాహంలో తేడా, అనుమతులు లేకుండా డ్యామ్లు నిర్మాణానికి ప్రయత్నించడం మరి కొన్ని కారణాలు. 2050 నాటికి బ్రహ్మపుత్ర, బారక్, తపతి నుంచి కన్యాకుమారి వరకు పశ్చిమ దిశలోకి ప్రవహించే నదుల్లో మాత్రమే తగినంత నీరు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నీటి విలువను తెలిపే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ను మరో మహామనీషి, మన మాజీ రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలాంగారు తయారు చేసి ఎప్పుడో ప్రజెంట్ చేసారు.కానీ మనమే పట్టించుకోలేదు. వాటిని పట్టించుకోలేదు.



భారతదేశ చరిత్రలో మునుపెన్నడూ లేనంతటి తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దేశంలో సుమారు 60 కోట్ల మందిని తాగునీటి కొరత తీవ్రంగా పీడిస్తోంది. ఇది ఇక్కడితో ఆగిపోలేదని, ముమ్ముందు సమస్య మరింత తీవ్రం కానుందని నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని 24 రాష్ట్రాల్లో పరిశీలన జరిపి నీతి ఆయోగ్ ఈ విషయం వెల్లడించింది. అంతేకాదు.. 21 నగరాలు తాగునీటి విషయంలో పెను ప్రమాదం అంచున ఉన్నాయని హెచ్చరించింది. ఆయా నగరాల్లో తాగునీటి అవసరాలు రోజురోజుకీ పెరుగుతుండగా అక్కడి భూగర్భ జలాలు మాత్రం అంతకంటే వేగంగా అడుగంటుతున్నాయని తేల్చింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆ 21 నగరాల్లో 2020 నాటికి భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతాయని హెచ్చరించింది. నీటి ఎద్దడి ప్రభావం వల్ల ఆహార భద్రతకు ముప్పు కలగొచ్చని నీతి ఆయోగ్ చెప్పింది.

దేశంలో వినియోగమయ్యే నీటిలో 80 శాతం వ్యవసాయానికే ఉపయోగిస్తుండడంతో నీటి కొరత ప్రభావం ఆహార ఉత్పత్తులపైనా పడనుంది. దేశంలోని అనేక నగరాలు, పట్టణాలు ఏటా వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటుంటాయి. ఇంటింటికీ తాగునీటి సరఫరా చేసేలా సువ్యవస్థీకృతమైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల ఏటా ఈ పరిస్థితి తప్పడం లేదు.వేసవి వచ్చిందంటే పబ్లిక్ కుళాయిలు, వీధుల్లోకి వచ్చే నీళ్ల ట్యాంకర్ల వద్ద బిందెలతో బారులు తీరడం సర్వసాధారణమైపోయింది. ప్రభుత్వం అరకొరగా సరఫరా చేసే నీరు చాలక ప్రయివేటు ట్యాంకర్లనూ ఆశ్రయిస్తుంటారు. ఇక గ్రామాల్లో అయితే స్వచ్ఛమైన తాగునీరు దొరక్క ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని.. దేశవ్యాప్తంగా ఏటా 2 లక్షల మంది అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల రోగాలకు గురై మరణిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. మరోవైపు పట్టణాలు, నగరాలు విస్తరిస్తుండడంతో పట్టణాల్లోని జలవనరులపై మరింత భారం పెరుగుతోంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2030 నాటికి దేశంలో తాగునీటి సరఫరా కంటే అవసరం రెండింతలు ఉంటుందని అంచనా. అంతేకాదు... నీటి కొరత కారణంగా దేశ స్థూల దేశీయోత్పత్తిలో 6 శాతం తగ్గుదల నమోదు కావొచ్చని అంచనా వేసింది. అయితే, జలయాజమాన్యం విషయంలో కొన్ని రాష్ట్రాలు మిగతా రాష్ట్రాల కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయి.

నీతి ఆయోగ్ జలయాజమాన్య సూచిలో గుజరాత్ ప్రథమ స్థానంలో నిలవగా.. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. అధ్యయనం చేసిన 24 రాష్ట్రాల్లో 15 గత ఏడాది కంటే కొంత ప్రగతి సాధించాయి. మరోవైపు జలయాజమాన్యం విషయంలో అట్టడుగున ఉన్న ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోనే దేశ జనాభాలో సుమారు సగం మంది నివసిస్తుండడం ఆందోళనకర అంశం. అంతేకాదు.. వ్యవసాయ ఉత్పాదకతా ఈ రాష్ట్రాల్లోనే ఎక్కువ. ఇలాంటి రాష్ట్రాలు జలయాజమాన్యంలో వెనుకబడడంపై నీతి ఆయోగ్ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది.జల వినియోగం, యాజమాన్యం విషయంలో కుటుంబాలు, పరిశ్రమలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వాలు ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో ఇబ్బంది పడుతున్నాయని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది.

ప్రభుత్వాలు ఇలా ఆలోచించకపోవటం వల్లే సహజ వనరు అయిన నీరు ఇప్పుడు వ్యాపార వస్తువుగా మారింది. డబ్బున్నవాళ్లకు కావాల్సి నంత దొరుకుతోంది. పేదలు కిలో మీటర్ల దూరం నుంచి తెచ్చుకోవాల్సి న పరిస్థితి తలెత్తింది. నీటిని పొదుపు చేస్తే సమాజానికి మేలు చేసినట్లే. ప్రకృతి ఇచ్చిన సంపద, వరం నీరు. అంత విలువైన నీటిని వృథా చేయటం ఒక విధంగా పాపం. నీరు సమృద్ధిగా ఉంటే సాగు బాగుంటుంది. కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు , ధాన్యం బాగా పండుతాయి. అందరికీ పని, ఆహారం దొరుకుతాయి. డబ్బు సంపాదిస్తారు. ఇలా చెప్పుకుంటూ పోతే నీటి ఉపయోగాలెన్నో. నీటికి సహజ వనరులైన చెరువులను, సరస్సులను, నదులను మనం సంరక్షించుకోవాలి. వ్యర్థాల నిర్వహణలో లోపాలు, పెరుగుతున్న రసాయన ఎరువుల, కల్తీ పురుగు మందుల వాడకంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి.

బీహార్, పశ్చిమ బెంగాల్ లలో భూగర్భ జల మట్టా లు పూర్తిగా తగ్గిపోయాయి. ఫలితంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే వీల్లేక కుటుంబాలతో కలిసి నగరాలకు వలస వెళ్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో నీటి కోసం యుద్ధాలు జరిగే ప్రమాదం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 500కు పైగా మంచినీటి నదులు కలుషితమయ్యాయి. భారీ యుద్ధాల్లో చనిపోయిన సైనికుల కన్నా కలుషిత నీరు తాగి మరణించినవారే ఎక్కువంటే అతిశయోక్తి కాదు. ఏడాదికి 40 లక్షల మంది కలుషిత నీరు తాగి మృత్యువాత పడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది.

**“ జలం మన బలం. నీటిని వృథా చేయకండి. నీటిని వృథాచేస్తే ఆఖరికి 'కన్నీరు'కూడా కరువవుతుంది! ”**

Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.